# ఘటన

అల్లుడు సాక్షాత్తూ విష్ణుమూర్తి– కూతురు సాక్షాత్తూ లక్ష్మీదేవి అని భావిస్తూ..

వరుడుకి కాళ్లు కడిగి కన్యాదానం చేస్తారు మామగారు.

అదే మంత్రార్థాల మధ్య సంప్రదాయ ప్రకారంగా పెళ్లిపందిరిలో కాబోతూన్న అల్లుడికి కాళ్లు కడుగుతున్నాడు రాఘవేంద్రరాజు. భార్య సుజాత నీళ్లు పోస్తోంది.

పురోహితుడు ఏవో మంత్రాలు చదివి తంతుని శాసిస్తున్నాడు. కానీ కన్నీళ్లతో.. రాఘవేంద్రరాజు మనస్సులో చాలాసార్లు కాళ్లు కడిగాడు.. చి. శేఖర్‌కి!!

✦ ✦ ✦

"కాళ్లిరగ్గొడతాను– నడూ– బైటకి నడు– రైల్లోంచి తోసేస్తే దిక్కూ మొక్కూ లేకుండా చస్తావు" రైల్వే పోలీసు... రాఘవేంద్రరాజు శేఖర్‌ని

తిట్లున్న అన్ని భాషల్లో తిడుతున్నాడు– దానికి వత్తాసు పలుకుతున్నాడు.. టిక్కెట్ కలెక్టర్– రెండు పులులు ఒక్క లేడి ఆ పరిస్థితి–

"నా మాట వినండి సార్.. నాకు ఫైన్ వేయండి.. నేను కడతా.. బాత్రూం దగ్గరైనా– నించుని ప్రయాణం చేస్తాను– నాది తప్పే– క్షమించండి"

"రిజర్వేషన్ కేబిన్‌లో కన్ఫర్మేషన్ లేకుండా ఎక్కడం– పైగా ఆర్గ్యుమెంట్– ఫైనెయ్యాలో పైకి పంపాలో మేం చూసుకుంటాం"

"పైగా నన్ను ఎదిరించాడయ్యా, టిక్కెట్ కలెక్టర్లంటే ఏవనుకుంటున్నాడు– పదో పరకో పడేస్తే.. ఎక్కడో అక్కడ బెర్త్ ఎలాట్ చేస్తాడు అనుకుంటున్నాడు– నేను అలాంటివాణ్ని కాదు నీకు తెల్సుగా"

"సార్ మీరూరుకోండి– వచ్చే స్టేషన్లో రైలు ఆగగానే మెడపట్టి గెంటేస్తాను. మీరు వర్రీ అవకండి.." టీసీ కోపాన్ని చల్లార్చి– మళ్లీ శేఖర్ వైపు విజృంభించాడు.

"ఆయన పెద్ద మనిషిరా– నీ వయస్సు ఆయన సర్వీసంత ఉండదు. ఆయనని డబ్బులు పెట్టి కొనేద్దామనుకుంటున్నావా? అసలు రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లోకి కన్ఫర్మ్ కాకుండా ఎందుకు ఎక్కావ్‌రా"

రా–అన్నా, బే–అన్నా, సాలే–అన్నా, ఏమన్నా కోపం రావట్లేదు శేఖర్‌కి. నిజానికి కోపం రాగూడదు అతనికి... మళ్లీ మళ్లీ రిక్వెస్ట్ చేస్తూ.. "నా మాట వినండి సార్ నేను అర్జంట్‌గా వెళ్లాలి.. మీ కాళ్లు పట్టుకుంటా" బిక్కచచ్చిపోయి బేలగా అడుగుతున్నాడు శేఖర్.

శేఖర్ బతిమాలిన కొద్దీ పోలీసు జులుం 'రేంజ్' పెరుగుతోంది.

మరో పరిస్థితిలో అయితే శేఖర్ అతన్ని రైల్లోంచి కిందికి తోసేసేవాడే– కానీ ఇప్పుడు అతనున్న స్థితి అంత సాహసం చేయకుండా అణిగిమణిగి ఉండమని హెచ్చరించింది.

"వచ్చే స్టేషన్‌లో దిగిపో– ట్రాక్ పట్టుకుని నడుచుకుంటూ వెళ్తావో– నడుస్తున్న బండిలో జనరల్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కుతూ పడి చస్తావో నీ ఇష్టం– చావకపోతే మా పోలీసులు అరెస్టు చేసి చిత్రవధ చేస్తార్లే"

రైల్వే పోలీసు రాఘవేంద్ర రాజు రకరకాల స్థాయీ స్వరాల్తో సమాజాన్ని యువతరాన్ని సంఘాన్నీ తిట్టిపోస్తున్నాడు.

ఆవేశంతో ఊగిపోతున్నాడు–

శేఖర్ నిశ్శబ్దంగా భరిస్తున్నాడు–

అతని మౌనం రాఘవేంద్రరాజుకి మరీ అసహనంగా వుంది–

ఇంకా కోపం వస్తోంది! ఇంకా అరుస్తున్నాడు–

ఆ ఆవేశంలో దగ్గు– గుండె గట్టిగా నొక్కి పట్టుకున్నాడు– మనిషికి చెమట్లు పడుతున్నాయి.

వాటర్ బాటిల్‌కోసం తన లగేజీని వెతుక్కుంటున్నాడు–

శేఖర్ కంగారుపడ్డాడు– తన బేగ్‌లోంచి ముందుగా ఓ మాత్ర తీసి అతని నాలిక కింద పెట్టాడు.

కొంచెంసేపట్లో అతడు కోలుకున్నాడు.

మంచినీళ్లు తాగి స్థిమిత పడ్డాడు.

"నీ దగ్గర ఈ టేబ్లెట్ ఎందుకుంది?"

"మా నాన్నకి ఈ టేబ్లెట్స్ చాలా అవసరం. అక్కడ దొరకట్లేదంటే.. ఇవ్వడానికి పట్టుకెళ్తున్నాను. ఇదే సార్.. నా అర్జెన్సీ కూడాను– అందుకే రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కేసాను"

రాఘవేంద్రరాజు సిగ్గుతో... చితికిపోతున్నాడు–

"రిజర్వేషన్ లేదంటే జనరల్‌లో టికెట్ తీసుకున్నా- రైలు కదిలిపోతుంటే... చేసేది లేక.."

"ఇక ఏం చెప్పకు బాబూ" అంటూచేతులు జోడించాడు.

"ఎప్పుడైనా మా ఇంటికిరా- రైల్వే క్వార్టర్స్‌లో..." అంటూ ఎడ్రస్ చెప్పాడు.

✦ ✦ ✦

ఆ తర్వాత చాలా రోజులకి శేఖర్... రాఘవేంద్రరాజు ఇంటికెళ్లే అవకాశం దొరికింది- రాఘవేంద్రరాజు ఇంటిల్లిపాదీ శేఖర్ అంటే గౌరవాలు చూపించారు. దేవుడే తమ ఇంటికి వచ్చాడనుకున్నారు-

అలా చాలాసార్లు వాళ్ల అభిమానాన్ని పొందాక- వాళ్లింటి అల్లుడవడానికి అంగీకారం కుదిరింది.

అల్లుడు సాక్షాత్తూ విష్ణుమూర్తి- మనస్ఫూర్తిగా కాళ్లు కడిగాడు.

"చచ్చిపో- చావు- చంపేస్తా"నన్న నోటితేనే.. దీర్ఘాయుష్మాన్ అని అక్షింతలేశాడు- కూతుర్ని దీర్ఘసుమంగళీభవ అని దీవించాడు- కన్నీళ్లతో అభిషేకిస్తూ-

దేవుడెన్ని చిత్రాలు చేస్తాడు-

ఆవేళ ట్రైన్‌లో టిక్కెట్ కలెక్టర్ వేషంలో ఉన్న ఆ పెద్ద మనిషే రెండు తిరుపతి టిక్కెట్స్ కొని తెచ్చి "కన్ఫర్మ్‌డ్ టిక్కెట్లయ్యా- మీ పెళ్లికి నా కానుక" అన్నాడు.

శేఖర్ చిన్నగా నవ్వాడు-

రాఘవేంద్రరాజు చల్లగా నవ్వి కళ్లు తుడుచుకున్నాడు.

